వికలాంగుల సంక్షేమానికి కృషి

ఆ శాఖ ఉప సంచాలకులు ప్రభాకర్

పాలకోడేరు: విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్ అన్నారు. పాలకోడేరుకు చెందిన విభిన్నప్రతిభావంతురాలు మంతెన సూర్యకుమారికి స్థానిక తహశీల్దార్ షేక్ హుస్సేన్ చేతుల మీదుగా మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వికలాంగురాలికి ట్రైసైకిల్ అందిస్తున్న ప్రభాకర్

'ఉపాధి'పై కుట్రలు తిప్పికొడదాం

దుష్ప్రచారం చేస్తూ మోడీసర్కార్ నిధుల కోత

పనిదినాలు, వేతనపెంపుపై పోరాటం తప్పదు

ఉపాధి హామీ చట్టం రాష్ట్ర సదస్సులో వక్తలు

ముఖ్య అతిధులుగా వ్యకాస జాతీయనేత, ఎంపీ శివదాసన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ సర్కార్ కుట్రలు పన్నుతోందని, వ్యవసాయ కూలీలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించి చట్టాన్ని కాపాడుకోవాల్సి ఉందని ఉపాధిహామీ పనిదినాలు, వేతనాల పెంపు, పట్టణాలకు వర్తింపజేయాలంటూ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో వక్తలు ముక్తకంఠంతో చెప్పారు. బుధవారం ఏలూరులోని కాశీవిశ్వేశ్వర కల్యాణమండపంలో రాష్ట్ర సదస్సు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధులుగా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, ఎంపీ శివదాసన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో రూ.28 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఉపాధి చట్టం దండగ అంటూ దుష్ప్రచారం చేస్తూ దెబ్బతీయాలని చూస్తోందన్నారు. కరోనా సమయంలో ఉపాధి పనులే పేదలను కాపాడాయన్నారు. ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచడంతోపాటు ప్రతియేటా రూ.మూడు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, పట్టణాల్లో ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న పలువురు నేతలు మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, పి.కిషోర్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెండు కోట్ల మందికి భూమి, ఇల్లు లేదు

వి.వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల కుటుంబాలకు భూమిగాని, ఇళ్లుగాని లేవు. వీరంతా రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలే. పశ్చిమగోదావరిలో రెండు లక్షల ఎకరాలు ఆక్వా చెరువులుగా మారిపోయాయి. పనిదినాలు తగ్గిపోయాయి. రోడ్ల పనులు సైతం యంత్రాలే చేస్తున్నాయి. మరి పేదలు ఏవిధంగా బతకాలి. పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ సర్కార్ దెబ్బతీయాలని చూడటం దారుణం. ప్రతి కుటుంబానికీ రెండెకరాల భూమైనా, 200 రోజులు పనైనా ఉండాలి. ఉపాధి చట్టం భిక్ష కాదు. ఉపాధి సొమ్ముతో రోడ్లు, భవనాలు నిర్మిస్తూ కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నారు.

ఉపాధి చట్టాన్ని కలిసికట్టుగా కాపాడుకుందాం

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఉపాధి హామీ చట్టం అంటే బటన్ నొక్కి డబ్బులు వేసేది కాదు. ఆనాడు 2004లో పార్లమెంట్లో 63 మంది వామపక్ష సభ్యులు ఉండబట్టి పోరాడి సాధించుకున్న చట్టం. ఆ నాడు కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్ష నాయకులకు మంత్రి పదవులు ఇస్తానన్న వద్దని, ప్రజలకు ఉపయోగపడే పథకాలు కావాలని, అలాంటి పథకాలకు అంగీకరిస్తేనే మద్దతిస్తామని చెప్పటంతో గత్యంతరం లేక నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి అంగీకరించి చట్టం చేసింది. దీనిని ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో గ్రామీణ కూలీలు ఐక్యంగా దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజలు సంఘటితంగా పోరాడాలి

పోరండ్ల శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

రోజురోజుకీ ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో చదువుకున్న యువత కూడా ఉపాధి కూలీలుగా మారుతున్నారు. గిట్టుబాటు ధరలు లేక నష్టాలు వచ్చి పేద రైతులు కూడా ఉపాధి కూలీలుగా మారుతున్నారు. ప్రభుత్వాలు పథకాలకు నిధులు పెంచకుండా ఉన్న పథకాలు నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన సిపిఎం ఇలాంటి సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఉపాధి హామీ లాంటి చట్టాలను కాపాడుకునేందుకు ప్రజలు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

కూలీలంటే ఈ ప్రభుత్వాలకు చిన్నచూపు

వి. శివ నాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత

దేశంలో, రాష్ట్రంలో ఆకలి చావులు పెరిగాయి. కనీస వేతనాలు లేవు. ఉపాధి పనులు లేక గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసలు పోతున్నారు. మరోపక్క వర్షాలు లేవు. పనుల కోసం కూలీలు ఆటోల్లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వడం లేదు. కూలీలు అంటే ఈ ప్రభుత్వాలకు చిన్న చూపు ఉంది. ఈ సమస్యలను నవంబర్ 15న విజయవాడలో జరిగే సభలో చర్చించాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఎర్రజెండా అధికారంలోకి రావాల్సిందే

షేక్ సాబ్జీ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి

చట్టసభల్లో ఎర్ర జెండాకు ప్రాతినిధ్యం తగ్గడం వల్ల ప్రజా సమస్యల గురించి చర్చించేవాళ్లు లేకుండాపోతున్నారు. ప్రస్తుత పాలకులు కార్పొరేట్లు, భూస్వాముల లబ్ధి కోసం ఆలోచిస్తున్నారు తప్ప సామాన్య ప్రజల గురించి ఆలోచించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికైనా మేల్కొని ఎర్రజెండాకు ఓటు వేసి చట్టసభల్లో వామపక్ష ప్రతి నిధులు ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే ఎర్రజెండా అధికారంలోకి రావాల్సిందే.

చట్టాలను నీరుగారుస్తున్నారు

మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి ఎన్నో చట్టాలు పోరాడి సాధించుకున్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వాలు వాటిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయి. దేశంలో సంపద అంతా కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. ఇద్దరు అమ్మేవాళ్లు, ఇద్దరు కొనేవాళ్లు ఈ దేశాన్ని శాసిస్తున్నారు. అలా కాకుండా అన్ని వర్గాలకు మేలు జరగాలంటే చట్టసభల్లో ఎర్రజెండా ప్రాతినిధ్యం పెరగాలి. ప్రజల ఆస్తులకు రక్షణ ఉండాలి. కాబట్టి రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి.

కరోనాలో ఉపాధి చట్టం గొప్పతనం తెలిసింది

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. కరోనా సమయంలో అందరికీ పని దొరికింది ఈ చట్టం వల్లే. చట్టం గొప్పతనం అప్పుడే అందరికీ తెలిసింది. పట్టణాల్లో పరిశ్రమలు మూతపడి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి పనులు కల్పించాలి.



పెంటపాడులో వినతిని అందిస్తున్న నాయకులు

విద్యుత్ భారాలు ఉపసంహరించాలని ధర్నాలు

ప్రజాశక్తి - పెంటపాడు

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యాన మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద బుధవారం ధర్నాలు నిర్వహించారు. అలంపురం, ముదునూరు, పెంటపాడు తదితర గ్రామాల్లో ఈ ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయా సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నేతలు బార్ల బాలాజీ, దత్తు రాము, వడ్డి సత్యనారాయణ, సిహెచ్.నీరజ, దత్తు పద్మ, నాగమణి, గాలి వెంకట్రావు, గాలి రాంబాబు, జక్కంశెట్టి పెంటారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలే ప్రభుత్వ ధ్యేయం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ధాన్యం పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ప్రతి ధాన్యపు గింజ మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతుకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలనేదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ అగ్రహారం రైతుభరోసా కేంద్రంలో బుధవారం జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రం తాడేపల్లిగూడెంలో ప్రారంభించుకోవడం శుభ పరిణామమన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత సీజన్‌లో అనుభవాలను అధికారులు దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రాంతాలవారీగా ముందస్తుగా తేదీలను నిర్ణయించుకుని ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో పంట కోతల సమయానికి మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. సిబ్బంది తేమశాతాన్ని పక్కాగా లెక్కించడంతోపాటు రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.చెన్నయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎస్‌ఒ ఎన్.సరోజ, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి తహశీల్దార్ జివి.శేషగిరి, రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పారదర్శకంగా భూముల రీ సర్వే పూర్తిచేయాలని రీ సర్వే స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ అజయ్ కల్లం, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు పాల్గొని సంబంధిత అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో భూ సర్వేలో ఖచ్చితమైన నిబంధనలను పాటించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు కానివాటికి మాత్రమే భూహక్కు పత్రాలను జారీ చేయాలన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే నాటికి హక్కుదారులకు లేదా రిజిస్టర్ పత్రాలను సమర్పించిన వారికి భూ హక్కు పత్రాలను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్లానింగ్, డిజిటల్ రెవెన్యూ సెక్రటరీలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. రీ సర్వే స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ అజయ్ కల్లం మాట్లాడుతూ వందేళ్ల తర్వాత భూముల సమగ్ర సర్వే జరుగుతుందని, 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష' పథకాన్ని తాడేపల్లిగూడెంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. భూ యజమానులకు హక్కు పత్రాల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. అనుమానాలకు తావులేని విధంగా భూ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల కోసం భూ హక్కు పత్రాలు అత్యంత ముఖ్యమైనవన్నారు.



మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

ఆరోగ్య సురక్షలో పేదలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ రాజు అన్నారు. బుధవారం మండలంలోని కాళీపట్నం పడమరలో జట్టు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవురు సావిత్రి ఆదినారాయణ, జడ్‌పిటిసి సభ్యులు తిరుమణి బాపూజీ, వైస్ ఎంపిపి కవూరు సీతామహాలక్ష్మి, సొసైటీ ఛైర్‌పర్సన్ దొంగ నాగముని, అంద్రాజు చల్లారావు, రేవు రాంబాబు, తన్నీడి గిరి ఉన్నారు.



బాలేపల్లిలో గ్రామస్తులు నుండి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

గ్రామాభివృద్ధికే గడపగడపకూ మన ప్రభుత్వం : గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

గ్రామాభివృద్ధి కోసం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం, మెంటేపూడి, బాలేపల్లి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వీరవాసరంలో నూతనంగా నిర్మించిన రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. మెంటేపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.8.50 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించి అనంతరం బాలేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించారు. గ్రామస్తులకు అందిస్తున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ప్రజల సూచనలు మేరకు వారి సలహాలు తీసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడి ప్రజా ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచులు కొల్లా సుధాలక్ష్మీకుమారి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, చికిలే మంగతాయారు, జెఎసి కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వైసిపి నాయకులు పోలిశెట్టి సత్యనారాయణ, నూకల కనకారావు, కొల్ల ఓంకారం, పడవల నాని పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీసు అమరవీరుల వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భీమవరం సిఎస్ఎన్ కళాశాలలో పోలీసు శాఖ, శ్రీవిజ్ఞానవేదిక, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్రోచర్ ఆవిష్కరణ, విద్యార్థులకు వివిధ పోటీలను బుధవారం నిర్వహించారు. బ్రోచర్ ఆవిష్కరించిన వన్ టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌పి రవిప్రకాష్ నేతృత్వంలో ఈనెల 30వ తేదీ వరకూ ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భీమవరం పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు కూడా తమతో భాగస్వాములు కావడం ఆనందదాయకమన్నారు. కళాశాల వ్యవస్థాపకులు చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు కూడా సహకరిస్తే మరింత ప్రతిష్టంగా భద్రత కల్పిస్తారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యంలో పోలీసుల పాత్ర' అంశంపై డిగ్రీ పీజీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని, 56 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ముగింపు వేడుకల్లో బహుమతులందిస్తామని తెలిపారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మదేవర ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : సమాజంలో అసాంఘిక శక్తులను నిర్వీర్యం చేసేది కేవలం పోలీసులు మాత్రమేనని ఎఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం బ్రాహ్మణచెరువు సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం చేర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాత్రీపగలు కష్టపడుతూ, ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే పోలీసులను గౌరవించాలన్నారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు దసరా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

శిక్షణా తరగతుల్లో విద్యార్థులు

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించబడుతున్న దసరా శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం పిల్లలకు తెనాలి రామకృష్ణ కథలు చెప్పి, పుస్తకాలు చదివించారు. వైఎన్ కళాశాల హెచ్ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాసరావు పిల్లలనుద్దేశించి మాట్లాడుతూ 'మంచి పుస్తకం - మంచి స్నేహితులతో సమానం', ఒక మంచి పుస్తకం జీవితాన్ని మార్చివేస్తుందన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే తప్పనిసరిగా లైబ్రరీ మెట్లు ఎక్కితీరాలని, ఈ బుక్ బ్యాంకును అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్ స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌లు, తాడి జీవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విద్యార్థులకు మెమరీ గేమ్ ఆడించడం, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. పిల్లలు చాలా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థి కేశవ ఆదిత్య పుట్టినరోజు జరుపుకుని పిల్లలకు కేకులు, స్నాక్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యం బాబు, ప్రవీణ్, సుధీర్ మోహన్, శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కట్టా విజయ్, మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈనెల 24వ తేదీవరకూ నిర్వహించబడుతున్నాయని గ్రేడ్-1 లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు.

అచ్చేదిన్ అని చచ్చేదిన్ తీసుకొచ్చారు

బిజెపి ప్రభుత్వంపై సిపిఎం ఎంపీ శివదాసన్ విమర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు అచ్చేదిన్ తీసుకొస్తానని ప్రచారం చేసి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం ప్రజలకు చచ్చేదిన్ తీసుకొచ్చిందని సిపిఎం ఎంపీ వి.శివదాసన్ (కేరళ) విమర్శించారు. ధరలు, నిరుద్యోగం తగ్గిస్తామని చెప్పి వాటిని పెంచుకుంటూ పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కిరాణా వర్తక సంఘ భవనంలో 'పాలకుల విధానాలు-ప్రత్యామ్నాయ రాజకీయాలు' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. శివదాసన్ మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధర కోసమే కాకుండా పంట అమ్ముకోవడానికి పోరాటం చేయాల్సిన దుస్థితి బిజెపి ప్రభుత్వ హయాంలో ఏర్పడిందన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కేవలం మతం పేరుతో ప్రజలను చీల్చి అధికారంలోకి బిజెపి వచ్చిందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని శివదాసన్ ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువులు, ఎరువుల ధరలు, ప్రజల ఔషధాల ధరలను పెంచి, జిఎస్‌టి తీసుకొచ్చి ప్రజలపై మోయలేని భారాలను మోపారన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగు జాడల్లో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీ విధానాలను వ్యతిరేకించి ప్రజా పోరాటాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బిజెపిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిపిఎం జిలా కార్యదర్శి బి.బలరాం మాట్లాడగా నేతలు కరెడ్ల రామకృష్ణ, బాపయ్యశర్మ, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, కండెల్లి సోమరాజు, మడక రాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రచార ఆర్భాటమే : సిపిఎం

టెస్టులతో సరిపెట్టకుండా పూర్తిస్థాయిలో వైద్యం చేయాలి

ప్రతీ సచివాలయం పరిధిలో ఆసుపత్రిని నిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల ఫలితం సున్నా అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. బుధవారం స్థానిక మీరా గ్రంథాలయ, సేవా కేంద్రంలో ఆ పార్టీ రాజకీయ విజ్ఞాన తరగతులు రెండో రోజు బుధవారం గోపాలన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష తూతూమంత్రంగా సాగుతోందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్లలో అంతంత మాత్రమే సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కేవలం టెస్టులతో సరిపెట్టకుండా పూర్తి చికిత్స అందించాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రతి సచివాలయ పరిధిలోనూ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని గోపాలన్ డిమాండ్ చేశారు. మూతపడ్డ ఎల్‌బి.చర్ల పిహెచ్‌సిని తెరవాలన్నారు. నరసాపురం కమ్యూనిటీ ఆస్పత్రిలో అన్ని ఆరోగ్య విభాగాలు ఏర్పాటు చేసి పూర్తి కార్పొరేట్ తరహా చికిత్సలు అందించాలన్నారు. అనంతరం గోపాలన్ 'పార్టీ కార్యక్రమం' అనే అంశంపై మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు 'పార్టీ నిర్మాణం' వివరించారు. ఈ తరగతులకు నరసాపురం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ తరగతుల నిర్వహణలో ఆచంట మాజీ శాసన సభ్యులు దిగుపాటి రాజగోపాల్, సిపిఎం నేతలు పొన్నాడ రాము, జల్లి రాము, యడ్ల చిట్టిబాబు, పొగాకు నారాయణరావు, జోగేశ్వరరావు, కొండ పాల్గొన్నారు.

24న దసరా సెలవు

భీమవరం: విజయదశమి పురస్కరించుకుని ఈనెల 24వ తేదీన సాధారణ సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి 2047 ఉత్తర్వును బుధవారం జారీచేశారు. గతంలో ఈనెల 24వ తేదీని ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించగా విజయదశమిని పురస్కరించుకుని 24వ తేదీన ఐచ్ఛిక సెలవు(ఒహెచ్)కు బదులుగా సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సిఎస్ డా.జవహర్ రెడ్డి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచార శాఖ అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి విలేకరి రాజశేఖర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - తణుకు

ప్రజాశక్తి తణుకు రూరల్ రిపోర్టర్ చిల్ల రాజశేఖర్ తల్లి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిల్ల సౌదామణి(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. బుధవారం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. సౌదామణి భర్త సాల్మన్ టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజశేఖర్ ప్రజాశక్తి విలేకరిగా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు సుధాకర్ హైదరాబాద్‌లో ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. రాజశేఖర్ భార్య సుభాషిణి తణుకులో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సౌదామణి స్వగ్రామం ఊరు భీమవరంలో గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు రాజశేఖర్ తెలిపారు. సౌదామణి మృతి పట్ల ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్ఎన్‌వి.ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, జిల్లా ఎడిషన్ ఇన్‌ఛార్జి పి.నారాయణరావు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి వై.సీతారాం, ఎడిటీ డివిజన్ ఇన్‌ఛార్జి కె.బాలాజీ తదితరులు సంతాపం తెలిపారు.

సౌదామణి (ఫైల్‌ఫోటో)

దాట్ల శ్రీదేవి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

సొంత ఊరిపై మమకారంతో కాళ్లకూరు గ్రామంలో దాట్ల వెంకటరామరాజు తన కుమార్తె పేరు మీద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు పి.యోహాను అన్నారు. కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన గండికోట బుజ్జి కుటుంబానికి 26 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పేదకుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

మాట్లాడుతున్న వేగేశ్న పుల్లంరాజు

రుబీ స్టోర్స్ ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రుబీ స్టోర్స్‌లో ప్రతిఒక్కరూ తమ సేవలను అందుకోవచ్చని అగ్రికల్చరల్ డిప్యూటీ మాజీ డైరెక్టర్ వేగేశ్న పుల్లంరాజు అన్నారు. పెనుమంట్రలో బైరాజు ఫౌండేషన్ వారి అనుబంధ సంస్థ అయిన బ్రేన్ సర్వీసెస్, గ్రామంలోని యుగ కమ్యూనికేషన్స్ ద్వారా ఆన్‌లైన్ సర్వీసెస్ ప్రారంభ కార్యక్రమం పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లంరాజు మాట్లాడుతూ ఈ సేవల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలు, బస్, ట్రైన్, విమాన టికెట్స్, సాధారణ ఈ కామర్స్ సేవలు, విద్య, వైద్య సంబంధిత సేవలు, అనేక ఇతర ఆన్‌లైన్ సేవలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గాదిరాజు సాయిరామరాజు, ముదునూరి రాము, ఎంపిటిసి సభ్యులు చింతపల్లి మంగాదేవి, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, కునపురెడ్డి సుబ్బరాజు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, రుబీ టీం, స్థానికులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటిగుంటలో దుర్గాదేవి దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా బుధవారం మహాలక్ష్మి అమ్మవారి అలంకరణ చేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు ఏటుకూరి రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దిరెడ్డి వెంకన్నారాయణ, పార్వతి దంపతులు, పెద్దిరెడ్డి శ్రీనివాసనారాయణ, నాగశ్రీవల్లి దంపతులు ఆర్థిక సహకారంతో తయారుచేసిన వెండి కిరీటాన్ని ఆలయ అర్చకులు శ్రీనివాసు వెంకట పవన్ కుమార్, ఆలయ నిర్వాహకులు ఏటుకూరి రామాంజనేయులు సమక్షంలో అమ్మవారికి బహూకరించారు. వెండి కిరీటాన్ని బహూకరించిన దాతల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.

వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

నేరాలు - ఘోరాలు

బాలికపై అత్యాచారం
యువకునిపై కేసు నమోదు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 17వ తేదీ రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వీరభద్రం తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పంజావేమవరం గ్రామానికి చెందిన యువకుడు పంజా నాగేంద్ర ఒక బాలికపై ఈ నెల 16వ తేదీ రాత్రి అత్యాచారం చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనను బాలిక మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన బాలిక తిరిగి ఇంటికి వెళ్తుండగా నాగేంద్ర బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కుమార్తె కనిపించడంలేదని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణచెరువుకు చెందిన బొడ్డు సురేష్ కుమార్తె రాణి పెనుమంట్ర హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో తరచూ సెల్‌ఫోన్ వాడుతుండడంతో ఈ నెల రెండో తేదీన తండ్రి సురేష్ మందలించాడు. దీంతో రాణి ఆ మరుసటి రోజు మూడో తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటినుంచి అన్ని చోట్ల వెతికినా ఎక్కడా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బైక్ దొంగలున్నారు జాగ్రత్త..!

రెప్పపాటులో మాయమవుతున్న ద్విచక్రవాహనాలు
హడలిపోతున్న వాహనదారులు
పోలీసులు నిఘా పెట్టాలని వేడుకోలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో బైకు దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రెప్పపాటులో తాళం వేసిన వాహనాలను సైతం మాయం చేస్తున్నారు. వరుస బైక్ దొంగతనాలతో వాహనదారులు హడలెత్తిపోతున్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర వ్యసనాలకు అలవాటు పడిన కొందరు బృందాలుగా ఏర్పడి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తుంది. దీనికి ఆయా ప్రాంతాల్లో కొందరు సహకరించి వీరు దొంగతనం చేసుకొచ్చిన వాహనాన్ని కొనుగోలు చేసి వారికి కొంత సొమ్ము ముట్ట చెబుతున్నట్లు సమాచారం. పెనుగొండ ప్రాంతంలో నడుస్తున్న మోటార్‌సైకిల్ విడిభాగాల అమ్మకాల దుకాణాల వద్ద వీటిని గుట్టుగా అమ్మకం చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. భారీఎత్తులో అక్కడ అమ్మకాలు జరుగుతున్నా పోలీసులు దృష్టి సారించకపోవడం వెనుక భారీగా సొమ్ములు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఈ బైక్ దొంగలు మరింత రెచ్చిపోతున్నారు. దొంగతనలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. భీమవరం జిల్లా కేంద్రం కావడంతో పట్టణ ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాదిమంది వివిధ పనులపై భీమవరం వచ్చి వెళ్తుంటారు. దీంతో ద్విచక్ర వాహనాలపై వచ్చినవారు తమ వాహనాలను పార్క్ చేసి పని ముగించుకుని తిరిగి వచ్చేసరికి దొంగలు ఆ బైకులను

చోరీ చేస్తున్నారు. ఇటీవల తహశీల్దార్ కార్యాలయం వద్ద తాళం వేసి ఉన్న ఒక ద్విచక్రవాహనాన్ని అపహరించుకుపోయారు. వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణంలోని రాయలం వెళ్లే రోడ్డులో కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో మరో బైక్ దొంగతనానికి గురైనట్లు సమాచారం. భీమవరానికి చెందిన ఒక విలేకరి స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న వినాయక ఆలయం వద్ద వినాయక చవితి సందర్భంగా జరుగుతున్న అన్న సమారాధన కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లి వచ్చేలోపు దొంగలు బండిని మాయం చేశారు. ఎక్కువగా ఆసుపత్రి వద్ద రోగుల బంధువుల ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివ అనే వ్యక్తి అనారోగ్యంగా ఉన్న తన కుమారుడిని డాక్టర్‌కి చూపించి వచ్చే లోపు తన ద్విచక్రవాహనాన్ని చోరి చేశారు. ఈ నెల ఆరో తేదీన డిఎస్‌పి కార్యాలయం పక్కనే ఉన్న యుటిఎఫ్ కార్యాలయం వద్ద పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని దొంగలు అపహరించుకుపోయారు. ఇటీవల కాలంలో ఒక ఇంట్లో దొంగలు చోరీ చేసి పోలీస్ డాగ్స్ కనిపెట్టకుండా కారం చల్లి వెళ్లారంటే వారి ఆలోచన ఏ విధంగా ఉందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. వరుస దొంగతనాలపై ఆయా పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసుల నుంచి స్పందన ఉండడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బైక్ పోయినప్పటికీ పోలీస్‌స్టేషన్ చుట్టూ తాము తిరగలేమని ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను తక్షణమే అరెస్టు చేయాలని, చోరీకి గురైన తమ వాహనాలను తమకు అప్పగించాలని బాధితులు జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు. పోలీసులు దొంగలపై నిఘా పెట్టినప్పటికీ ఇటీవల రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీంతో నిరసనకారుల గృహ నిర్బంధానికి, నిరసన కార్యక్రమాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని, ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. దొంగతనాలను అరికట్టాలని వాహనదారులు, పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

గ్రంథాలయంలో శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

గ్రంథాలయంలో శిక్షణా తరగతులు

పెనుమంట్ర : మార్టేరు శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో క్రాఫ్ట్, చదరంగం నిర్వహించారు.

డాక్టరేట్ గ్రహీత నిరీక్షణరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

డాక్టరేట్ పట్టా రావడంతో మరింత బాధ్యత పెరిగిందని సంఘ సేవకులు, అవార్డు గ్రహీత డి.నిరీక్షణరాజు అన్నారు. మండలంలోని కాళ్ల గ్రామంలో డాక్టరేట్ అవార్డు గ్రహీత డి.నిరీక్షణరాజుకు బుధవారం ఘనంగా సత్కార సభ నిర్వహించారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా సమయంలో మొదటి, రెండు దశల్లో వందలాది మంది కార్మికులకు రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించిన ఘనత నిరీక్షణరాజుదేనన్నారు. ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. నిరీక్షణరాజు చేస్తున్న సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు అందించిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నిరీక్షణరాజు మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ రావడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతిఒక్కరూ సామాజిక సేవలో పాలొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్టా కృపావరం, తాళ్లూరి రాజ్‌కుమార్, సిరింగి బాల, గండి శ్రీనివాస్, గునుపూడి ప్రసన్నకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరీక్షణరాజును సత్కరిస్తున్న వక్తలు

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మోగల్లు సచివాలయం-2 పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు)తో కలిసి పివిఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ శిబిరంలో అవసరమైన వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు (బాబు), ఉప సర్పంచి పెనుమత్స సీతారామరాజు (సీతయ్య)లు పివిఎల్, ఎంపిపి చంటిరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్, సర్పంచుల ఛాంబర్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, ఎసిపి మండల అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు కాటూరి శాంతకుమారి, పెనుమత్స వెంకటలక్ష్మి, నరేష్, నాయకులు పంపన శ్రీను, నరసింహరాజు, నాగారం, జాలే సునీత, కోణాల ప్రకాష్, గోడి భూషణం, బాపిరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రారంభం

మోగల్లు ఎస్‌సి ప్రాంతంలో రూ.13.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు ప్రారంభించారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు (బాబు)లు వంట గది, స్టోర్ రూమ్‌లను ప్రారంభించారు. అనంతరం పివిఎల్ నరసింహరాజును, ఎంపిపి చంటిరాజును, కాంట్రాక్టర్ నరసింహరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, సూపర్‌వైజర్ పార్వతి, సర్పంచి పెనుమత్స సీతారామరాజు (సీతయ్య) ఎఎంసి డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, మద్దుల మౌళి, మాణిక్యాలరావు, పాల రాధాకృష్ణ, శివకోడు హనుమంతరావు, నాగేశ్వరరావు, బాలయ్య, భలే చిట్టిబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : పివిఎల్‌ను సత్కరిస్తున్న సీతారామరాజు, వెంకటరాజు

గణపవరం : ప్రజల ఆరోగ్య రక్షణకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తుందని గణపవరం సర్పంచి మోర అలంకారం అన్నారు. గణపవరం జూనియర్ కాలేజీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య రక్షణ విషయంలో ఎవరూ అశ్రద్ధ చేయవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరంలో వైద్యం పొందాలన్నారు. వైద్య శిబిరంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 13 మంది వృద్ధులకు సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి కళ్లజోళ్లు అందించారు. వైద్య శిబిరంలో 1819 మందికి వైద్య సేవలందించినట్లు గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతి ర్మయి తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.కిరణ్మయి, మధుర వెన్నెన్ హాస్పిటల్ తాడేపల్లిగూడెం డాక్టర్ చైతన్యకిరణ్, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, ఉప సర్పంచి దండు రాము, అంగన్‌వాడీ ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిపి, వైసిపి నాయకులు

ఆకివీడు : మండల కేంద్రమైన ఆకివీడు పట్టణంలో నాలుగు సచివాలయాల పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సరోజినీ నాయుడు బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జానీ హైమావతి అధ్యక్షతన నిర్వహించిన సభలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని, వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు కరిమేరక రామచంద్రరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, రణస్థల మహంకాళి, రాయి సతీష్, బులుసు రామకృష్ణ, సిరికి ఎర్రయ్య, ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : సచివాలయం-3 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పూతినీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నక్క శ్యామల, సోనీ శాస్త్రి, జెడ్‌పిటిసి సభ్యులు పి.గోవర్ధన, ఎంపిడిఒ, తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 36వ రోజు బుధవారం కొనసాగాయి. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని తనయుడు పితాని వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్క ంటి ప్రభాకర్, కనపాల వెంకటేశ్వరరావు, రాపాక ఆనం దరావు, ఏడిది శ్రీనివాసరావు, మానేపల్లి సత్యనారా యణ, కుసుమ వెంకటేశ్వరరావు, కుసుమే అరుణ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పాలకొల్లులో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో తెలుగు మహిళలు చేపట్టిన నిరాహారదీక్షలు బుధవారం 36వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షులు కర్నేన రోజారమణి మాట్లాడారు.

కాళ్ల : చంద్రబాబును వేధిస్తున్న సర్కారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టిడిపి గ్రామ అధ్యక్షుడు మంతెన ఆంజనేయరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడులో బాబుతోనేను ఇంటింటికి ప్రచారం కార్యక్రమం ఆంజనేయరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాబత్తుల వంశీకృష్ణ, మంతెన కృష్ణంరాజు, యాళ్ల చిట్టిబాబు, కొట్టి ప్రభాకరరావు, అంకాల రంగబాబు, లంకపల్లి ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

కాళ్ల : బాబుతో నేను కార్యక్రమంలో టిడిపి నాయకులు

మొగల్తూరు : చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించడం దారుణమని ఆ పార్టీ అగ్నికుల క్షత్రియ టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో టిడిపి అగ్నికుల క్షత్రియ నాయ కులు రహదారిపై వలలతో నిరసన ప్రదర్శన చేశారు. గ్రామ ంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిడి రాం బాబు, కొల్లాటి బాలకృష్ణ, బుల్లబ్బాయి, పెంటయ్య, మూలస్వామి, బంధన నాగేశ్వరరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

ఆకివీడు : రాజారెడ్డి రాజ్యాంగాన్ని తప్పించి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరుతూ టిడిపి నేతలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోటిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన 30వ వార్డు బలుసుముడిలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, టిడిపి నాయకులు మాదాసు కనకదుర్గ, ఎండి షబీనా సయ్యద్, నసిమబేగం, గంధం రాధ, పామర్తి వెంకటరామయ్య, ఏసుపాదం, చెల్లబోయిన సుబ్బారావు, బొక్క సూరిబాబు, చెల్లబోయిన గోవింద్, మద్దుల రాము, బొక్క శ్రీనివాస్, జంపన ధనరాజ్ పాల్గొన్నారు.

29న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 29వ తేదీన స్థానిక బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో నిర్వహించే పోటీల బ్రోచర్లను ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణం కేంద్రంగా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిగా మిస్టర్ ఆంధ్రా రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ప్రథమంగా ఏర్పాటు చేశారన్నారు. క్రీడాకారులకు నగదు బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్న జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వాహకులను అభినందించారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కటారి రవిశంకర్, షేక్ ఖాసింలు మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బాడీ బిల్డింగ్ క్రీడాకారులు పెద్దఎత్తున విచ్చేస్తున్నారని, విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు అందిస్తున్నామని, వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పట్టణంలో బాడీ బిల్డింగ్‌లో ఎంతో మంది యువకులకు శిక్షణ ఇచ్చి, ఎన్నో కాంపిటీషన్స్ పోటీలు నిర్వహిస్తూ వస్తున్న షేక్ ఖాసింను ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాస్, రిచ్చి, మోటేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దసరా పండుగను పురస్కరించుకుని స్వగ్రామాలకు వస్తున్న ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి రెగ్యులర్ సర్వీసులతో పాటు 35 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. భీమవరం డిపో నుంచి ఎనిమిది, నరసాపురం డిపో నుంచి ఆరు, తాడేపల్లిగూడెం డిపో నుంచి 11, తణుకు డిపో నుంచి 11 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదని తెలిపారు. పండుగ అనంతరం తిరిగి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

గరగపర్రులో 'ఇంటింటికీ టిడిపి'

పాలకోడేరు : రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. మండలంలోని గరగపర్రులో ఇంటింటికి తెలుగుదేశం- ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, తెలుగుదేశం పార్టీ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

కడిమి సంధ్య, భర్త: కిరణ్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు యింటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నంబర్ **U8130907** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
కడిమి సంధ్య, భర్త: కిరణ్
డోర్ నంబర్: 15-173
రాజుగూడెం, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 79952 32782

NOTICE

Notice of Will Enquiry Under Section 41 (2) of Registration Act 1908: WilCASE No. 1OF 2023

Notice is hereby given to all whom so ever it may concern that Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Sur .yanarayana Reddy aged about 36 years Occupation Advocate, Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad .District - 500 080, Telangana State, presented on 16th August, 2023 before me a Will alleged to have been executed on 16th April,2021 by his mother late Smt. Bethireddy akshmikantham W/o; Sri B. Suryanarayana Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad District - 500 080, Telangana State, bequeathing her immovable and movable properties situated at Poduru village and Mandal, West Godavari District, Andhra Pradesh and Hyderabad in favour of (1) Mr. Bethireddy Suryanarayana S/o. Mr. late B. Tata Reddy aged about 72 years (Husband) (2) Ms. Bethireddy Bhavani D/o. ate S.R. Bethireddy aged 47 years (Daughter) (3) Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Surtyanarayana Reddy aged about 36 years (Son) all are resident of Secunderabad Telangana State, for registration of the Will after her death (Testatrix) under Section 41 (2) (b) of the Registration Act 1908 and the enquiry will be held by the under signed on 04-11-2023.

All those interested are hereby requested to appear before the Enquiry Officer, on the above date with their witnesses and other evidence if any in support of their contentions. If witnesses on behalf of any one to be summoned, application together with required fee should be credited with the enquiry officer fifteen days before the date fixed for enquiry.

SCHEDULED "A" IMMOVABLE PROPERTIES

(1) all that Flat bearing No. 101, in Imperial House, situated at 6-3- 865/A, Ameerpet, Hyderabad - 500 016.

(2) Agriculture land admeasuring 0.50 cents (including 0.40 cents of coconut garden) situated under survey Nos. 65-3 and 67-2, situated at Kavitam and 0-72 cents of agriculture lands situated under survey No. 159/1, situated at Poduru village (near Kavitam locks) Poduru Manda, West Godavari District, Andhra Pradesh state.

SCHEDULED "B" MOVABLE ASSETS

(1) the moveable properties all that Term deposits in various Banks, Deposit under Senior Citizens savings scheme in SBI and PPF Account in Secunderabad HPO in her name and Saving Bank Accounts in SBI and Indian Bank jointly with my husband and Gold ornaments weighing about 350 grams

Dated: 18-10-2023:
Office of the Sub-Registrar Secunderabad at Kavadiguda: